ఆ రోడ్డుకు మోక్షం ఎప్పుడో?

● వర్షాలకు అధ్వానంగా మారిన రోడ్డు

దొనకొండ: దొనకొండ–గజ్జలకొండ రోడ్డు పరిస్థితి దయనీయంగా మారింది. వర్షానికి రోడ్డుపై అడుగుకో గుంత ఏర్పడింది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ రోడ్డు బాగుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు వస్తుందోనని గ్రామాల్లోని ప్రజలు ఎదురు చూస్తున్నారు. పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో రోడ్డు సైడు జారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు నిత్యం ఈ రోడ్డు నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఇండ్లచెరువు, గజ్జలకొండ, నాగిరెడ్డిపల్లి, పొట్లపాడు, గానుగపెంట తదితర గ్రామాల ప్రజలు నిత్యం వాహనాలపై వెళ్తుంటారు. ఇటీవల ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే. అంతేకాకుండా ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. రాత్రి పూట ఈ రోడ్డు మీద ప్రయాణం చేయాలంటే ఎదురు వచ్చే వాహనాలు తప్పించబోయి ప్రమాదాలు జరిగిన సంఘటన లేకపోలేదని పలువురు వాహన చోదకులు వాపోతున్నారు. గ్రామాల్లోని ప్రజలు నిత్యం మండల కేంద్రమైన దొనకొండకు అనేక పనులపై తరుచూ వస్తుంటారు. అంతేకాకుండా పొలాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంటుందని రైతులు వాపోతున్నారు. ఆటోలు సైతం ఈ రోడ్డుపై ప్రయాణించి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఫలితంగా డ్రైవర్లు కిరాయికి రావడం లేదు. వర్షం పడిన సమయంలో రోడ్డు మొత్తం నీరు చేరుతుంది. వాహన చోదకులకు రోడ్డు కనపడటం లేదు. కూటమి నేతలు ఎన్నికల సమయంలో అభివృద్ధికి కట్టుబడి ఉంటామని వాగ్దానాలు చేశారు. అధికారం చేపట్టి నేటికి 10 నెలలు దాటినా దొనకొండ–గజ్జలకొండ రోడ్డుకు మోక్షం కలగ లేదని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఎన్నోసార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతులు చేపట్టి వాహన చోదకులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయా గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

ప్రమాదాలు జరుగుతున్నాయి:



రోడ్డు అధ్వానంగా తయారవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దొనకొండ నుంచి రాత్రి వేళల్లో గ్రామానికి చేరుకోవాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది. వాహనాలు కిరాయికి రావడం లేదు. అధికారులు మరమ్మతులు చేపట్టాలి.

– పైడిపోగు రామయ్య, మాజీ సర్పంచ్

వర్షాకాలం ఇబ్బందిగా ఉంది:



నిత్యం ఈ రోడ్డు నుంచి వ్యవసాయ పనులకు వెళ్లాల్సి ఉంది. వర్షం పడిన సమయంలో చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. మండల కేంద్రం దొనకొండకు, మార్కాపురం వెళ్లాలంటే ఈ రోడ్డే దిక్కు. మరి ముఖ్యంగా దొనకొండకు విద్యార్థులు పాఠశాలకు రావల్సి వస్తోంది. వర్షం పడిన రోజు విద్యార్థులు బడికి రావటం మానుకుంటున్నారు. అధికారులు వెంటనే ఆ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి వాహన చోదకులకు, రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– పత్తికొండ సుబ్బయ్య, మాజీ సర్పంచ్, ఇండ్లచెరువు

క్లుప్తంగా

వేసవిలో పిల్లల కదలికలను గమనించాలి

పుల్లలచెరువు: ప్రస్తుతం ఇంటర్, పదో తరగతి పరీక్షలు పూర్తి కావడం, మిగిలిన తరగతులకు కూడా త్వరలో సెలవులు ఇవ్వనుండటంతో పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సంతోష్‌కుమార్ సూచించారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఇటీవల కాలంలో మండలంలోని పలు గ్రామాల్లో వర్షం పడటంతో చిన్న చెరువుల్లోకి, కుంటల్లోకి నీరు చేరిందన్నారు. సెలవుల్లో ఇంటికి వచ్చిన పిల్లలు తమ తల్లిదండ్రులు పనులకు వెళ్లిన తర్వాత సరదాగా ఈతకు వెళ్లడం లేదా మోటర్ సైకిల్ డ్రైవ్ చేయడం వంటి పనులు చేస్తున్నారని, దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, గతంలో మండలంలోని పలు గ్రామాల్లో అనేక సంఘటనలు జరిగాయని గుర్తు చేశారు. తల్లిదండ్రులకు కన్నీటిని మిగిల్చిన సంఘటనలు గుర్తు చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తలు పాటిస్తూ వారి కదిలికలను గమనించాలని సూచించారు. పిల్లల పట్ల శ్రద్ధ చూపుతూ ప్రేమగా మాట్లాడాలని సూచించారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యం

● ఎంపీపీ సుంకర సునీత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

ముండ్లమూరు (కురిచేడు): అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే మండలాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ సుంకర సునీత పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ వేసవి కాలం ఆరంభమైందని, ఎండలు మండిపోతున్నాయని, తాగునీటి సమస్య లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సమన్వయంతో పనిచేసి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులతో మమేకమై ప్రజాసేవలో పాల్గొని ప్రజా సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టి మండలాన్ని అభివృద్ధి పథంలో నడపాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ రత్నపాల్, మండల ప్రత్యేకాధికారి ఎన్వీ రమణ, మండల అభివృద్ధి అధికారి జనార్దన్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వ్యవసాయాధికారి మహ్మద్ ఫరూక్, పంచాయతీరాజ్ ఏఈ ఎం. వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ భారతి, వైద్యాధికారి బి.మధుశంకర్, ఎం. జాస్మిన్, పశువైద్యాధికారి ఎం.విజయలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలి

ముండ్లమూరు (కురిచేడు): వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ దర్శి డివిజన్ ఈఈ పి.శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ వేసవిలో అకాల వర్షాలు, ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగి, వంగిపోయాయని, ఆ సమయాల్లో విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పేరుకుపోయిన బకాయిలపై దృష్టి సారించి నూరుశాతం వసూలు జరిగేలా చూడాలన్నారు. అధిక లోడుపై 50 శాతం రాయితీతో తమ లోడు కెపాసిటీ పెంచుకునే అవకాశం కల్పించామని, దాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సబ్ ఇంజినీర్ కె.ఇమ్మానుయేల్‌బాబు, లైన్‌మెన్ పీవీ ఆంజనేయులు, పి.మధుబాబు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి


పోషకాహారం గురించి వివరిస్తున్న ఎంపీడీఓ సతీష్‌బాబు

కురిచేడు: ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని ఎంపీడీఓ బి. సతీష్‌బాబు అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మంచిపోషకాహారం తీసుకుంటే మంచి ఆరోగ్యం పొందొచ్చన్నారు. సూపర్‌వైజరు సుభాషిణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారం లబ్ధిదారులందరూ తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు గల ఆహారం తయారు చేసుకునే విధానాన్ని అంగన్‌వాడీ సిబ్బంది తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం పోషణ పక్వాడ్ ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో దాహం కేకలు


మూలనపడిన మినరల్ వాటర్ చలివేంద్రం


పెద్దదోర్నాలలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం

● కనికరించని అధికారులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీరు లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేటి తరుణంలో అధికారులు, స్వచ్ఛంద సంస్థలు తాగు నీరు ఏర్పాటు చేయకపోవటంపై సుదూరం నుంచి వచ్చే ప్రయాణికులు బస్సులు ఆపి మరీ తాగునీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

వందల సర్వీసులు, వేలల్లో ప్రయాణికులు

దిగువ శ్రీశైలంగా పేరొందిన పెద్దదోర్నాలలో నిత్యం వందల సంఖ్యలో ఆర్టీసీ సర్వీసులు ఇక్కడి నుంచి పలు ప్రాంతాలకు వెళ్తుంటాయి. రాష్ట్రంలో 24 గంటలు బస్సు సర్వీసులు నడిచే జంక్షన్‌గా పెద్దదోర్నాలకు పేరుంది. దీంతో పాటు రాష్ట్రంలోని అన్ని సుదూర ప్రాంతాలకు ఇక్కడి నుంచి బస్సుల సౌకర్యం ఉంది. తెలంగాణ, కర్నాటక రాష్ట్రానికి సంబంధించి ఎన్నో సర్వీసులు క్రమం తప్పకుండా ఇక్కడి నుంచి నడుస్తుంటాయి. ద్వాదశ జ్యోతిర్లింగంగా, అష్టాదశ శక్తి పీఠంగా వెలుగొందుతున్న శ్రీశైల పుణ్యక్షేత్రానికి ముఖద్వారంగా ఉన్న పెద్దదోర్నాలలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడకూడదన్న ఒక్క కారణంతోనే ఇక్కడ బస్టాండ్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మండు వేసవి ప్రారంభమై రోజులు గడుస్తున్నా బస్టాండ్‌లో తాగునీరు అందుబాటులో లేక పోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. దీంతో బస్సులు ఆపి బస్టాండ్ బయట దుకాణాల్లో డబ్బులు చెల్లించి నీరు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అంతంత మాత్రమే

బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛంద సంస్థల సేవలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. గతంలో కొందరు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఉచిత మినరల్ కూలింగ్ వాటర్ కంటైనర్లు, చలివేంద్రాలు పెట్టి ప్రయాణికుల దాహార్తి తీర్చేవారు. అయితే వేసవి ఎండలు మండుతున్నా ఆయా సంస్థలు తాగునీటిపై దృష్టి సారించక పోవడంతో సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణాలు కొనసాగించే ప్రజల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు చొరవ చూపి ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చొరవ చూపాలని అధికారులు కోరుతున్నారు.

బస్సులు ఆపి తాగునీరు కొనుగోలు చేస్తున్నాం:

ఇంతటి ప్రాముఖ్యం ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు ఆపి మరి నీరు కొనుగోలు చేస్తున్నాం. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు చొరవ చూపి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి.

– సత్యనారాయణ, ప్రయాణికుడు, విజయవాడ

ఏఐవైఎఫ్ మహాసభలు జయప్రదం చేయాలి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

దర్శి (కురిచేడు): అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి కోరారు. స్థానిక గుజ్జుల సరళాదేవి భవన్, సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ యువతను అన్ని రకాలుగా మోసం చేస్తున్న పాలకులపై ఉద్యమించేందుకు మహాసభలు వేదిక కానున్నాయన్నారు. మోదీ అధికారంలోకి వస్తే ఏటా 2 కోట్ల మందికి ఉద్యోగాలు ఇస్తానని బీజేపీ ఎన్నికల ముసాయిదాలో ప్రకటించి మూడు సార్లు అధికారంలోకి వచ్చినా ఆ హామీ అమలు కాలేదన్నారు. మే 15 నుంచి 18 వరకు జాతీయ మహాసభలు తిరుపతిలో నాలుగు రోజులపాటు జరగనున్నాయని, మహాసభలకు వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. మహాసభల్లో ఆయా రాష్ట్రాల్లో యువజన రంగంపై పాలకులు అనుసరిస్తున్న విధానాలపై నిర్దిష్టమైన చర్చలు ఉంటాయన్నారు. అనంతరం తీర్మానాల ద్వారా భవిష్యత్తు పోరాటాలకు పిలుపునిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు పుట్టా సుబ్బారావు, గులాం హుస్సేన్, పూర్ణచంద్రరావు, మస్తాన్, ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.పవన్, రామాంజి యాదవ్, జి.స్టాలిన్ పాల్గొన్నారు.

ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంఈఓ–2 సుబ్రహ్మణ్యం

పెద్దారవీడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని ఎంఈఓలు పి. శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశం హాలులో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌పై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్ అధికారులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించి ఉన్నత విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను తదుపరి తరగతుల్లో చేర్పించాలని, ప్రమోషన్ జాబితా తయారు చేయాలని సూచించారు. ఎన్‌రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సమష్టిగా ఇంటింటికీ తిరిగి ప్రతి విద్యార్థి పాఠశాలలో చేరే విధంగా కృషి చేయాలన్నారు. సీడీపీఓ కుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రల్లో చదివే పిల్లలందరినీ ఒకటో తరగతిలో కచ్చితంగా చేర్పించేందుకు బాధ్యత తీసుకోవాలని కార్యకర్తలను ఆదేశించామని చెప్పారు. ఈఓఆర్డీ జ్ఞానసుందరరాజు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి, వేదికపై చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

● ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

కురిచేడు: ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు, ఇవ్వని హామీలను కూడా నూరు శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని గంగదొనకొండలో సోమవారం రాత్రి జరిగి శ్రీ గంగాభవాని తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై పార్టీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజల అవసరాలను గుర్తించి వారి అభివృద్ధికి కృషి చేసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెన్నంటి ఉండి జీవితాంతం ప్రజాసేవలో ఉంటానన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ పార్టీ ఓడిపోలేదని, ప్రజాభిమానం చూస్తేనే ఇది అర్థమవుతోందని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఎన్నికలలో ఏం జరిగిందో ప్రజలకు కూడా తెలుసన్నారు. రాబోవు రోజుల్లో అందరిలో ఒకడిగా ఉండి ప్రజాసేవ చేస్తానని స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సర్పంచ్ ఆసుపల్లి రామలక్ష్మమ్మ, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, మండల కన్వీనర్ వైవీ సుబ్బయ్య, ఎంపీటీసీలు గండి అంకమ్మ, బుల్లం వెంకట నర్సయ్య, కానాల శివారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు పోతిరెడ్డి నాగిరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కండె గంగయ్య, కురిచేడు, బయ్యవరం సర్పంచ్‌లు కేసనపల్లి కృష్ణయ్య, ఎం.నాగేశ్వరరావు, నాయకులు ఆసుపల్లి చెన్నారెడ్డి, కర్నాటి వెంకటరెడ్డి, అందె సుబ్బారెడ్డి, కసిబిసి వెంకటేశ్వర్లు, గోదల సుబ్బారెడ్డి, లక్కిరెడ్డి సుబ్బారెడ్డి, గండి సంతారావు, ఏసురత్నం, మోటాటి శ్రీనివాసరెడ్డి, కర్నాటి రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్


భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్ విద్యార్థులు

పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్ దీక్షా ప్రమాణ్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనసూయాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రత్యేక అహ్వానితులుగా ఎస్ఎంసీ చైర్మన్ ఖాదర్‌వలి హాజరయ్యారు. పాఠశాలకు చెందిన 16 మంది బాలురతో స్కౌట్ యూనిట్, 16 మంది బాలికలతో గైడ్స్ యూనిట్ ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు. స్కౌట్ మాస్టర్‌గా ఆంజనేయులు వ్యవహరించనున్నట్లు తెలిపారు. నాగమూర్తి, కిరణ్, ఆవులయ్య, పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐదేళ్లు నిండిన పిల్లల వివరాలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎంఈఓ మస్తాన్ నాయక్

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఎంపీడీఓ నాసర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ మస్తాన్‌నాయక్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఐదు సంవత్సరాలు నిండిన పిల్లల వివరాలు తీసుకోవాలని సూచించారు. దీంతో పాటు వారి ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌లో తప్పులు ఉంటే సరి చేయించుకోవాలని సూచించారు. 5,7,8 తరగతులకు ప్రమోటైన విద్యార్థుల వివరాలు ప్రధానోపాధ్యాయులు తీసుకొని వారిని డ్రాపౌట్ కాకుండా తిరిగి పాఠశాలలోనే ఉండేలా తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించారు. ఎంఈఓలు మస్తాన్‌నాయక్, కొండలరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతోనే భూసారం పెంపు సాధ్యం


నవధాన్యాల సాగు గురించి వివరిస్తున్న డీపీఎం సుభాషిణి

ముండ్లమూరు (కురిచేడు): ప్రధాన పంట కన్నా ముందు నవధాన్యాల సాగుతోనే భూసారం పెంచటం సాధ్యమవుతుందని ప్రకృతి వ్యవసాయ డీపీఎం సుభాషిణి తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయం ఆవరణలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ విభాగం నుంచి సిబ్బంది 23 రకాల విత్తనాలు 30 క్వింటాళ్లు సేకరించారు. పీఎంపీడీఎస్ కిట్లుగా వాటిని తయారు చేశారు. కార్యక్రమామనికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రకృతి విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతు ఈ విధమైన విత్తనాలతో సాగు చేసి భూసారాన్ని పెంచుకోవాలని సూచించారు. కిట్లను రైతులకు ఆర్‌ఎస్కేల ద్వారా అందుబాటులో ఉంచారు. నవధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నామని, ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ప్రతి రైతును ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేందుకు ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది గ్రామ సభలు, ర్యాలీల ద్వారా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వ్యవసాయాధికారి ఫరూక్, ఏపీఎం హనుమంతరావు, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ జె.ప్రభాకర్, ఇన్‌చార్జిలు ఎం.కోటయ్య, ఎం.వేణుగోపాల్, ఈ.నాగసుభాషిణి, డి. యోగేశ్వరమ్మ, ఐసీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

పెద్దదోర్నాల: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, భ్రమరాంబికా మల్లికార్జున సినిమా హాలు, సుందరయ్య కాలనీ, తదితర ప్రాంతాల్లో ప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ ఫైర్ అఫీసర్ హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

దర్శి (కురిచేడు): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా రక్షించుకోవాలనే దానిపై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించినట్లు అగ్నిమాపక కేంద్ర అధికారి సీహెచ్ జాలయ్య తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, శివశంకర సినిమా హాలు, స్మార్ట్ మాల్స్ వద్ద ప్రజలకు డెమో ద్వారా అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తమను తాము రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డెమో ద్వారా వివరించారు. కరపత్రాలు పంచి ప్రజలను చైతన్యపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


దర్శి: ఓ మాల్‌లో అగ్నిమాపక సిబ్బంది డెమో


మంటలార్పే విధానంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

యర్రగొండపాలెం: అనుకోకుండా అగ్ని ప్రమాదం జరిగితే ఆందోళన పడకుండా దాని నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక నలంద, శ్రీచైతన్య పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలని, ఆ మంటలు వ్యాప్తి చెందకుండా తాము కృషి చేయాలన్నారు. గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వచ్చిన వెంటనే ముందుగా గ్యాస్ ఆపేయాలని, ఆ తర్వాత మంటలు చెలరేగకుండా దానిపై మూతపెట్టాలని ఎస్ఎఫ్‌వో డి.మాల్యాద్రి అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో–2 మల్లూ నాయక్, సిబ్బంది సీహెచ్ కాశీవిశ్వనాథం, వి.వెంకటేశ్వర్లు, సీహెచ్‌వీ రవి, బాబు, జీవీ రవి, పి.కృష్ణానాయక్, వి.పూర్ణచంద్రారెడ్డి, ఎం.తార్యనాయక్, బి.రామాంజి నాయక్, బి.ఆంజనేయులు, డి.ఆంజనేయులు, ఆయా పాఠశాలల కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు.